క్లుప్తంగా

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి



మాట్లాడుతున్న చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద

కర్నూలు కల్చరల్: చిన్న తనం నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద అన్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాలలో భగవద్గీత శ్లోకా కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. గీతా జయంతిని పురస్కరించుకొని మండల, జిల్లా, రాష్ట్రా స్థాయిలో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం మండల స్థాయిలో అన్ని పాఠశాలల్లో పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మమ్మ, మమత, తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో సేవలపై ప్రశంసలు



కేంద్ర బృందం సభ్యులతో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఎ.క్యాంపులో ఉన్న మెరిడియన్ ఫంక్షన్ హాలు సమీపంలో ఉన్న యూపీహెచ్‌సీని శనివారం జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ సభ్యులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ ప్రశాంత్ సత్యదేవ్ సందర్శించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను, వైద్యుల పనితీరును రోగులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఓపీ, ఐపీ సేవలు, ల్యాబ్, ఫార్మసి రూమ్, నేషనల్ ప్రోగ్రామ్స్ అయిన ఎయిడ్స్, లెప్రసి, మలేరియా, ఫ్యామిలి ప్లానింగ్ తదితర రికార్డులను పరిశీలించారు. అన్ని విభాగాలు సంతృప్తికరంగా ఉన్నాయని, నాణ్యతా ప్రమాణాలు పాటించినందుకు కేంద్రం నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్డ్ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసిందని తెలిపారు. వారి వెంట డీపీఎంవో డాక్టర్ ఉమా, డీపీవో విజయరాజు, వైద్యాధికారి డాక్టర్ మాధవి, డీక్యూఎం డాక్టర్ రూపకుమార్ ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కర్నూలు(టౌన్) : నగరపాలక పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవతేజ ఆదేశించారు. శనివారం స్థానిక గుత్తి పెట్రోల్ బంకు ఫ్లై ఓవర్ కింద చేపడుతున్న వేండర్ జోన్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. డి.గోపాలకృష్ణయ్యతో పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, ఏఈ భానుప్రతాప్ పాల్గొన్నారు.

మారథాన్ రన్‌లో జిల్లాకు మూడో బహుమతి

కర్నూలు(హాస్పిటల్): హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని భావించి శనివారం రాష్ట్ర స్థాయిలో విజయవాడలో నిర్వహించిన 5కె మారథాన్ రన్‌లో కర్నూలు జిల్లాకు 3వ, 7వ స్థానాలు దక్కాయి. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన ఎ. దినకర్ 3వ స్థానాన్ని, షేక్షావలి 7వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు వీరిని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసి అధికారి డాక్టర్ భాస్కర్, సెట్కూరు సీఈవో పీవీ. రమణ అభినందించారు.

నేడు నారీ శక్తి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: నారీ శక్తి సమ్మేళనం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీఆర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ట్లు నిర్వాహకులు రాధిక, దేవకి దేవి తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, చిన్మయమిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఫిల్మ్ సెన్సార్‌బోర్డు సభ్యులు ఐటీ ఇండస్ట్రీ టీమ్ లీడర్, హైదరాబాద్ సామాజిక కార్యకర్త ముదిగొండ సుస్మ, తాడేపల్లి గూడెం స్పందన ఫౌండేషన్ చైర్ పర్సన్ బోగిరెడ్డి ఆదిలక్ష్మి రెడ్డి ముఖ్య వక్తలు హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అన్ని రంగాల్లోని మహిళలు ఈ సమ్మేళనంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

లేపాక్షి హస్తకళల ప్రదర్శన

కర్నూలు(అగ్రికల్చర్): లేపాక్షి హస్తకళల ప్రత్యేక ప్రదర్శన, అమ్మకాల ఎగ్జిబిషన్‌ను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు లేపాక్షి హస్త కళా ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు మేయర్ బీవై రామయ్య ప్రారంభిస్తారని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ అక్టోబరు 15 వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో హస్తకళలకు సంబంధించిన అనేక రకాల వస్తువులు, బొమ్మలు, దేవతామూర్తుల విగ్రహాలు, చిత్రపటాలు లభిస్తాయని తెలిపారు.

ప్రజల చెంతకు వైద్యసేవలు

- ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత
- ఊరూరా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన
- నగరంలో మెడికల్ క్యాంపునకు విశేష స్పందన
- సందర్శించిన మేయర్, ఎంపీ, ఎమ్మెల్యే



ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన



వైద్య సేవల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): ప్రభుత్వం ప్రజల చెంతకు వైద్య సేవలను తీసుకెళ్తుందని, ఇందులో భాగంగా ఊరూరా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ సృజన అన్నారు. శనివారం స్థానిక కింగ్ మార్కెట్ వద్ద వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును కలెక్టర్ పరిశీలించారు. శిబిరంలో కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్‌కుమార్, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్వతహాగా డాక్టర్ అయిన సంజీవ్‌కుమార్ శిబిరంలో రోగులు, ప్రజలకు సేవలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 428, పట్టణ ప్రాంతాల్లో 28 వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి మండలంలో మున్సిపాలిటీల్లో రోజుకు ఒక క్యాంపు చొప్పున నిర్వహిస్తున్నామని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో స్పెషలిస్టు డాక్టర్ల ద్వారా సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎంపీ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఖరీదైన వైద్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ప్రజారోగ్యానికి ఆయన అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఆనాడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించారన్నారు. నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్ ప్రజల దగ్గరికే వైద్య సేవలను తీసుకెళ్తున్నారన్నారు. జిల్లాలో 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తారన్నారు. బీపీ, షుగర్, కిడ్నీ, రక్త తదితర ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయడమే కాక అవసరమైన వారికి మందులు అందజేస్తారన్నారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్నకు విద్య, వైద్యం రెండు కళ్లు లాంటివన్నారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రతి పేద వాడికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని సౌకర్యాలతో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరాల్లో 60 రకాల వైద్య పరీక్షలు, 130 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. కంటి వెలుగు కింద అవసరమైన కంటి అద్దాలు అందించడంతో పాటు శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు.

సేవల పరిశీలన

మెడికల్ క్యాంపులో రోగులకు అందజేస్తున్న సేవలను కలెక్టర్, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఆరోగ్య పరీక్షలు చేసే గదులను, డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగుకు సంబంధించిన పరీక్ష గదిని కలెక్టర్ తనిఖీ చేస్తూ సంబంధిత మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన పోషక విలువలను తెలియజేసే న్యూట్రిషన్, కూరగాయలు, ఆకుకూరలు, మిల్లెట్స్‌తో తయారు చేసిన వంటకాల ప్రదర్శన కౌంటర్లను కలెక్టర్ సృజన, ఎంపీ సంజీవ్‌కుమార్, మేయర్ బీవై.రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ భార్గవ్‌తేజ, ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వర్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నగర అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ, గాజుల శ్వేతారెడ్డి, సీహెచ్ మద్దయ్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్



హైకోర్టు జడ్జితో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్) : ఏపీ హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేషన్స్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్‌ను కలెక్టర్ డాక్టర్ జి.సృజన కలిశారు. కర్నూలు వచ్చిన ఆయన రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో విడిది తీసుకుంటుండగా కలెక్టర్ మర్యాద పూర్వకంగా వెళ్లి బొకే అందజేశారు. అనంతరం జిల్లాలోని తాజా పరిస్థితులను ఆమె జడ్జికి వివరించారు.

వృద్ధాప్యం శాపం కాకూడదు

కర్నూలు(హాస్పిటల్): మనిషి జీవితంలో ఎవ్వరికీ వృద్ధాప్యం శాపం కాకూడదని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గాయత్రి ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో నిరుపేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్య దశ కొందరికి శాపంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దశలో చాలా మంది శారీరక, మానసిక సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో వృద్ధులకు చాలా గౌరవం ఉండేదని, ప్రస్తుతం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కావడంతో వృద్ధులు అనాధాశ్రమాల్లో ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

హక్కులను సద్వినియోగం చేసుకోండి

- మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి

కర్నూలు(అర్బన్) : రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం స్థానిక బుధవారపేట మారెమ్మ గుడి సమీపంలో 36వ వార్డు సచివాలయంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. డీవీఎంసీ సభ్యులు సాయిప్రదీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కులవివక్షను నిర్మూలించాలన్నారు. కుల వివక్ష, రెండు గ్లాసుల పద్ధతిని ఎవరైనా పాటిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, కులం, మతం విభేదాలు లేకుండా జీవించాలన్నారు. డీవీఎంసీ సభ్యులు సాయి ప్రదీప్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. దళితులకు దేవాలయాల్లోకి ప్రవేశాన్ని నిషేధించినా, వెట్టి చాకిరీ చేయించుకున్నా చట్టపరంగా నేరమవుతుందన్నారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, డీవీఎంసీ సభ్యులు నవీన్ కుమార్, వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు కేదార్‌నాథ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సచివాలయం, మెప్మా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బుడగ, బేడ జంగాల బాంధవుడు సీఎం

కర్నూలు(సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుడగ, బేడ జంగాల బాంధవుడని బుడగ, బేడ జంగాల సంఘం నాయకులు తూర్పాటి మనోహర్ పేర్కొన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సెప్టెంబర్‌లో పత్తికొండకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుడగ, బేడ జంగాలను ఎస్సీ రిజర్వేషన్ కల్పనకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరినట్లు చెప్పారు. అప్పుడు సీఎం ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని, అందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

గుండె వైద్య నిపుణులకు సన్మానం

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డేనియల్ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుండె, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ గౌతమ్ చక్రవర్తి, డాక్టర్ రాఘవేంద్రను శనివారం ఘనంగా సన్మానించారు. ఆయా వైద్యుల వద్దకే ఫౌండేషన్ అధ్యక్షులు సుమన్ వెళ్లి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పేదలకు ఉచిత వైద్యం అందించామని, వైద్యులను సన్మానించినట్లు తెలిపారు.

భాషా ప్రయుక్త రాష్ట్ర రాజధానికి 70 ఏళ్లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు సిటీ: మొదటి భాషా ప్రయుక్త రాష్ట్ర రాజధానిగా కర్నూలు ఏర్పడి నేటి (ఆదివారం)తో 70 సంవత్సరాలు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని శనివారం డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ఆ కాలేజీ, కర్నూలు జిల్లా మేధావుల కన్సార్టియం ఆధ్వర్యంలో కర్నూలు వైభవం పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్ కర్నూలు వైభవం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాయలసీమ ముఖద్వారామైన కర్నూలు జిల్లాలో ఎందరో ప్రముఖులు జన్మించారన్నారు. అయినా ఇప్పటికీ ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అనంతరం ఆచార్య మన్సూర్ రెహమాన్ మాట్లాడుతూ 1858 జూలై 1వ తేదీన పరిపాలన సౌలభ్యం కోసం 8 తాలూకాలతో కర్నూలు జిల్లా ఏర్పాటు అయ్యిందన్నారు. 1953 అక్టోబరు 1వ తేదీన ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా కర్నూలు ఎంపికై, 1956 అక్టోబరు 31వ తేది వరకు సేవలు అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జిల్లా చరిత్ర గురించి చరిత్ర అధ్యాపకులు జె.చెన్నయ్య వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు ఆదినారాయణ రెడ్డి, మాదన్న, వెంకటస్వామి, డా.డి నాగన్న, మురళీధర్, డా.ఉమర్, తదితరులు పాల్గొన్నారు.

మేల్ నర్సుపై దాడి చేసిన హౌస్‌సర్జన్ల సస్పెన్షన్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మేల్ నర్సు ఇర్ఫాన్‌పై దాడి చేసిన ముగ్గురు హౌస్‌సర్జన్లను శనివారం అధికారులు సస్పెండ్ చేశారు. ఈ నెల 26వ తేది రాత్రి క్యాజువాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఇర్ఫాన్‌పై కొందరు హౌస్‌సర్జన్లు దాడి చేసిన విషయం విదితమే. ఈ దాడికి సంబంధించి సైకియాట్రి హెచ్ఓడీ డాక్టర్ నాగేశ్వరరావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీబాయి, నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకట తులశమ్మలతో విచారణ కమిటీ వేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం కమిటీ విచారణ చేపట్టింది. శనివారం కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చర్చించారు. దాడికి పాల్పడిన హర్ష, ఐనక్‌లపై నెలరోజుల పాటు, సాయిచరణ్‌పై 15 రోజుల పాటు సస్పెన్షన్ విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సస్పెన్షన్ ఉన్న సమయంలో వారు ఆసుపత్రిలో డ్యూటీలకు రాకూడదని, సస్పెన్షన్ కాలాన్ని వారి హౌస్‌సర్జన్ ముగిసిన అనంతరం పనిచేయాలని సూచించారు.

మైపర్ కాలేజీ అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ గ్రహీతను సన్మానిస్తున్న మైపర్ కాలేజీ డైరెక్టర్ ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేస్తున్న ఎం.రాజ్‌కుమార్‌కు ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం ఆ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని సన్మానం చేశారు. కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ ఫార్ములేషన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ లాన్సోప్రజోల్ అండ్ ఎసోమ్‌ప్రజోల్ ఫాస్ట్ డిసల్వింగ్ ఓరల్ తిన్ ఫిలిమ్స్ బై యూజింగ్ సింథటిక్ అండ్ నాచురల్ పాలిమర్స్ అనే అంశంపై చేసిన పరిశోధనలకు ఆంధ్ర యూనివర్సిటీ తమ అధ్యాపకుడికి డాక్టరేట్ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.జె రవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కాకర్ల సురేష్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రోహిణికి డాక్టరేట్



కర్నూలు (న్యూసిటీ) : పాములపాడు మోడల్ స్కూల్‌లో ఫిజిక్స్ (పీజీటీ) అధ్యాపకురాలుగా పని చేస్తున్న బి.రోహిణికి డాక్టరేట్ లభించింది. రాయలసీమ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ మెలటింగ్ లేయర్ క్యారెక్టరిస్టిక్స్ ఓవర్ రాయలసీమ, సెమీ అరిడ్ రీజియన్ ఆఫ్ ఇండియా అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించింది. ఈ విషయాన్ని అవార్డు గ్రహీత శనివారం తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల జీవితాల్లో వెలుగు



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ రాజారెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి వారి జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిది అని ఆర్టీసీ డైరెక్టర్ ఎ. రాజారెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక కర్నూలు-1డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఆర్టీసీ ఉద్యోగులను పట్టించుకోలేదన్నారు. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి 12019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని చెప్పారు. బడ్జెట్‌లో రూ. వేలకోట్లు కేటాయించి ఆర్టీసీకి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. నష్టాలను నివారించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైన రాయితీలు ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం కార్గో సేవలను మరింత విస్తృతం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో డీసీఎ టీఎం రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

క్రీడల్లో ప్రతిభ చాటండి



కరాటే పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శనివారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో కరాటే, ఖో-ఖో, తైక్వాండో, బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పద్మావతి మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ క్రీడలను వినియోగించుకొని క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్) : అక్టోబర్ 1, 2 తేదీల్లో నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు.

ప్రారంభమైన 'శౌర్య జాగరణ యాత్ర'



శౌర్య యాత్రను ప్రారంభిస్తున్న లలితా పీఠం వ్యవస్థాపకులు సుబ్రహ్మణ్య స్వామి

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్,బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం శౌర్య జాగరణ యాత్ర ప్రారంభమైంది. ఓల్డ్‌సిటీలోని జమ్మిచెట్టు లలితా పీఠం వద్ద ఆ పీఠం వ్యవస్థాపకులు సుబ్రహ్మణ్య స్వామి, రాష్ట్ర ధర్మ ప్రసార్ రాష్ట్ర కన్వీనర్ ఏవీ ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, నగర అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, జిల్లా బజరంగ్ దళ్ ప్రముఖ్ మీనుగు రాజేష్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ హిందువుల సమైకృత కోసం అశేష హిందూ శక్తిని నిద్రావస్థ నుంచి మేల్కొపడానికి యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. నగరంతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ శౌర్య యాత్ర సాగుతుందన్నారు.కార్యక్రమంలో నగర బజరంగ్‌దళ్ ప్రము ఖ భగీరథ, సహ ప్రముఖ బి.నాగరాజు, కార్యదర్శి ఈపూరి నాగరాజు, జిల్లా సాప్తయిక్ మిలన్ ప్రముఖ్ సాయి, రామకృష్ణ, గోవిందరాజులు, రాకేష్, గణేష్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

2047కు అభివృద్ధి చెందిన దేశంగా భారత్

కర్నూలు(సెంట్రల్): 2047వ సంవత్సరానికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌దేశం నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆకాంక్షించారు. శనివారం ఢిల్లీలోని భారత మండపం నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల మధ్య సంకల్ప సప్త కార్యక్రమాన్ని వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి కావాల్సిన వనరులు, అవసరాలను గుర్తించామని, త్వరలోనే ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

'నా జీవనయానం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ఇంటిలెక్చువల్ కలెక్టివ్ ఆధ్వర్యంలో ఆదివారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లూరి సోమరాజు రచించిన ఆత్మకథ 'నా జీవనయానం' పుస్తకావిష్కరణ సభ జరిగింది. క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. సాయిగోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.కుమార్, సాహితీ వేత్తలు డాక్టర్ వి.పోతన్న, ఎస్.డి.వి.అజీజ్, కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రమణ ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత ఎస్. ఎం.డి. ఇనాయతుల్లా, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎమ్. ఫామిదాబేగం మాట్లాడారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఖదీరుల్లా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళి

కర్నూలు(సెంట్రల్) : ఎంఎస్ స్వామినాథన్ హరిత విప్లవ పితామహుడని, ఆయన దేశంలో పేదరికాన్ని నిర్మూలించాలని ఎంతో శ్రమించారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య భవన్‌లో ఆ పార్టీ నాయకులు ఎంఎస్ స్వామి నాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు డి.గౌస్‌దేశాయ్, జి.రామకృష్ణ, పీఎస్ రాధాకృష్ణ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్యస్థాపనే లక్ష్యం

కర్నూలు(సెంట్రల్): కార్మిక రాజ్యస్థాపనే లక్ష్యంగా సీఐటీయూ పని చేస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.గోపాల్ అన్నారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ నగర నిర్మాణ వర్క్ షాపు జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.

అక్రమ అరెస్ట్ తగదు

కర్నూలు సిటీ: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం తగదని ఆ సంఘం నాయకులు శనివారం సుందరయ్య సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నగర అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడారు.





ప్రజల ప్రాణాలంటే టీడీపీ నాయకులకు లెక్కలేనట్టుంది. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శనివారం రాత్రి చేపట్టిన మోతమోగిద్దాం కార్యక్రమంతో గాయత్రీ ఎస్టేట్ వద్ద ట్రాఫిక్ స్తంభించిపోయింది. అత్యవసర సేవలకు సంబంధించిన అంబులెన్స్ వాహనాలు సైతం అందులో చిక్కుకున్నాయి. -సాక్షి ఫొటో గ్రాఫర్, కర్నూలు

సిలికా ఖనిజ ప్రాంతాల పరిశీలన



పుడిచెర్లలో సిలికా ఖనిజ ప్రాంతాలను పరిశీలిస్తున్న జిల్లా మైనింగ్ డీడీ, విజిలెన్స్ ఏడీ

కర్నూలు (న్యూసిటీ): సిలికా ఖనిజ ప్రాంతాలు ఎక్కడెక్కడ ఉన్నాయో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఓర్వకల్లు మండలంలోని పుడిచెర్ల, గుట్టపాడు, బొడ్డువానిపల్లె గ్రామాల్లో సిలికా ఖనిజ ప్రాంతాలను గుర్తించామని ఆయన శనివారం తెలిపారు. మినరల్ బ్లాక్ ఏరియాలను పరిశీలించి లీజుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన తరువాత వేలం పాట నిర్వహించి సిలికా ఖనిజ ప్రాంతాలను లీజుకు కేటాయిస్తామన్నారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి యుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.